క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ బీఎస్ఎన్ఎల్, హకీంషా ఫీడర్ల పరిధిలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, మిరాజ్ కాలనీ, ఐఏఎస్ కాలనీ, చోటా జానకీ నగర్, బక్తవర్ గుడ, జానకీ నగర్, పారమౌంట్ కాలనీ, ఎంసీహెచ్ కాలనీ, హకీంషా కుంట, బృందావన్ కాలనీ, డీలక్స్ కాలనీ, పారమౌంట్ గేట్ నెంబర్ 1 ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే 11 కేవీ సబ్జా కాలనీ ఫీడర్ పరిధిలోని బృందావన్ కాలనీ, సబ్జా కాలనీ, రిలయన్స్ స్మార్ట్, డీలక్స్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పుత్లీబౌలి విద్యుత్ ఫీడర్ పరిధిలో..

అఫ్జల్‌గంజ్: 11 కేవీ పుత్లీబౌలి విద్యుత్ ఫీడర్ పరిధిలోని మహాత్మాగాంధీ బస్‌స్టేషన్, అఫ్జల్‌గంజ్ బస్‌స్టాండ్, సీబీఎస్ తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే విక్టరీ ప్లే గ్రౌండ్ ఫీడర్ పరిధిలోని విక్టరీ ప్లే గ్రౌండ్స్ తదితర ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రైతులకు కొత్త పంట రుణాలు ఇవ్వాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న తుమ్మల నాగేశ్వర్‌రావు

గన్‌ఫౌండ్రీ: ఇటీవల రుణమాఫీ కింద లబ్ధి పొందిన రైతులకు త్వరితగతిన తిరిగి కొత్త పంటలకు రుణాలు ఇవ్వాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు బ్యాంక్ అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆదివారం అబిడ్స్‌లోని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటీవ్ అపెక్స్ బ్యాంకు కార్యాలయంలో సంస్థ నూతన సంవత్సర డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోఆపరేటీవ్ బ్యాంక్‌లో రైతుల రుణమాఫీ, బ్యాంక్ పనితీరు, ఆర్థిక అంశాలను ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కోఆపరేటీవ్ అపెక్స్ బ్యాంక్ అధ్యక్షులు ఎం.రవీందర్‌రావు, ఎండీ బి.గోపీ, రిజిస్ట్రార్ ఉదయ్‌కుమార్, పాలకవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

రాజేంద్రనగర్: టీజీ ఆర్టీసీ రాజేంద్రనగర్ డిపో పరిధిలో ప్రయాణికులకు మెరుగైన సేవలు, సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా సోమవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్ డిపో మేనేజర్ బద్రీనారాయణ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు, కాలనీవాసులు పాల్గొని తమ విలువైన సలహాలు, సూచనలు, ఫిర్యాదులు చేయాలని డీఎం సూచించారు. ఆర్టీసీ బస్సులు ప్రయాణికులు తమ ఫిర్యాదులను ఫోన్: 99592 26135లో తెలియజేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఈబీసీ రెడ్డి విద్యార్థుల ఉన్నత విద్యకు స్కాలర్‌షిప్

అత్తాపూర్: ఈబీసీ రెడ్డి విద్యార్థుల ఉన్నత చదువుల కోసం రెడ్డి సంఘం అత్తాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని సొసైటీ అధ్యక్షుడు గుమ్మడి భూపాల్‌రెడ్డి, కార్యదర్శి మంగళారం గోవర్ధన్‌రెడ్డిలు తెలిపారు. రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆర్థిక సమస్యలతో ఇతర దేశాలలో ఉన్నత చదువులు చదవలేక ఉన్న కుటుంబాల విద్యార్థులకు చేయూత ఇస్తామన్నారు. ఎవరో వస్తారు ఏదో చేస్తారు అని ఎదురు చూడకుండా మెరిట్ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో ఉన్నత విద్యాభ్యాసం చేసేవారు, ఇతర దేశాల్లో చదువుకునే వారికి మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేస్తామని వారు వివరించారు. పేదరికం అడ్డు రాకూండా చూడాలన్న లక్ష్యంతో రెడ్డి సంఘం అత్తాపూర్ సొసైటీ కృషి చేస్తుందన్నారు. వివరాలకు ఫోన్స్: 90326 53330, 99495 03350లలో సంప్రదించాలని కోరారు. నేతలు బద్దం జీవిత్‌రెడ్డి, మిద్దల రామ్‌రెడ్డి, బి.రాజారెడ్డి, ఇంద్రసేనరెడ్డి, పాశం మధుసుధన్‌రెడ్డి, పి.సుధాకర్‌రెడ్డి, పి.రాజశేఖర్‌రెడ్డి, పన్నాల విరాజున్‌రెడ్డి, బి.జనార్థన్ రెడ్డి, సూర్యలక్ష్మణ్‌రెడ్డి, గుమ్మడి శ్రీకాంత్‌రెడ్డి, కొత్తకాపు చెన్నారెడ్డి, మేకల శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందడే..సందడి



గుల్జార్ హౌజ్ నడి రోడ్డులో..



గోల్కొండ కోట వద్ద పర్యాటకులు

చార్మినార్: పాతబస్తీలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, చౌమొహల్లా ప్యాలెస్, మక్కా మసీద్, లాడ్ బజార్ తదితర పర్యాటక ప్రాంతాలని ఉదయం నుంచి రాత్రి వరకు సందర్శకులతో కిటికిటలాడాయి. తమ కుటుంబ సభ్యులు బంధుమిత్రులతో కలిసి పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. ఉత్సాహంగా సెల్ఫీలు దిగి సరదాగా గడిపారు. సాధారణ రోజుల్లోనే చార్మినార్ ప్రధాన రోడ్డు వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఇక ఆదివారం ఈ రూట్లో సందర్శకులకు ట్రాఫిక్ తిప్పలు తప్పలేదు. చిరు వ్యాపారాలు జోరుగా కొనసాగాయి.

గోల్కొండ కోటలో..

గోల్కొండ: పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోటలో మరోసారి జాతర వాతావరణం నెలకొంది. వేలాదిగా తరలివచ్చిన పర్యాటకులతో గోల్కొండలోని ప్రధాన రహదారులన్ని పర్యాటకుల వాహనాలతో రద్దీగా మారాయి. మరోవైపు ఉదయం 7.30 నుంచే కోట మెయిన్ గేటు వద్ద పర్యాటకులు టికెట్ల కోసం బారులు తీరారు. సంవత్సరం చివరి వారం కావడంతో భారీగా వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారని గోల్కొండ కోట హిస్టరీ గైడ్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మహ్మద్ అర్షద్ అహ్మద్ అన్నారు. డిసెంబర్ నెల చివరి వారంలో ఇంత భారీ సంఖ్యలో పర్యాటకులు రావడం ఇదే మొదటిసారి అని ఆయన తెలిపారు. భారీగా తరలివచ్చిన పర్యాటకులతో కోటలోని అన్ని ప్రాంతాలు కిటకిటలాడాయి.

ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి



ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.సుధాకర్‌తో కలిసి టోలిచౌకీ చౌరస్తా సెవన్ టూంబ్స్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అక్రమ పార్కింగ్‌లు తదితర విషయాలపై ట్రాఫిక్ పోలీసులతో చర్చించారు. అనంతరం ఆయన సెవన్ టూంబ్స్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ రోటరీని పరిశీలించారు. సెవన్ టూంబ్స్ చౌరస్తా నుంచి బంజారి దర్వాజా వరకు ట్రాఫిక్ నివారించడానికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామని ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివరించారు. సెవన్ టూంబ్స్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన రోటరీ ఎత్తు పెరిగిందని దీనిని తగ్గించాల్సిన అవసరం ఉందని ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ, రోటరీల ఏర్పాటు తదితర విషయాలు ట్రాఫిక్ అధికారులపై ఉందని అన్నారు. ఏదేమైనా కూడా సెవన్ టూంబ్స్ నుంచి బంజారి దర్వాజా మీదుగా ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతుందన్నారు. ముఖ్యంగా బంజారి దర్వాజ వద్ద రాత్రి 12 వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందన్నారు. ఇక్కడ ట్రాఫిక్‌ను తగ్గించడానికి తాము సెవన్ టూంబ్స్ నుంచి గోల్కొండ రేషం బాగ్ వరకు దీనికి సంబంధించిన జాయింట్ సర్వే కూడా పూర్తి అయిందని ఆయన అన్నారు.

ట్రాఫిక్ వివాదం ఘర్షణలో నలుగురి అరెస్టు

చార్మినార్: ట్రాఫిక్ వివాదం ఘర్షణలో బీజేపీ నాయకులపై దాడి చేసిన నలుగురినిందితులను చార్మినార్ పోలీసులు అరెస్టు చేశారు. వారికి 41 సీఆర్పీసీ నోటీసులు జారీ చేశారు. చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 27న రాత్రి ఘాన్సీబజార్‌లో తలెత్తిన ట్రాఫిక్ వివాదంలో నిందితులు బీజేపీ నాయకులపై దాడికి పాల్పడ్డారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగించిన చార్మినార్ పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. శాలిబండకు చెందిన వస్త్ర వ్యాపారి నజీర్ (27) అనే ప్రధాన నిందితుడితో పాటు బహదూర్‌పురాకు చెందిన మహమూద్ (30), బిలాల్ (27), కాలాపత్తర్‌కు చెందిన ఫైజాన్ (19) అనే నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతుందన్నారు.

ముగిసిన అఖండ హరినామ్ సప్తాహ కార్యక్రమాలు



విఠల్ రుక్మిణీ పల్లకీ శోభాయాత్రలో కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

గౌలిపురా: సర్దార్ పటేల్‌నగర్‌లోని విఠల్ రుక్మిణి ఆలయంలో అఖండ హరినామ్ సప్తాహ కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. ఈ నెల 22న ప్రారంభమైన అఖండ హరినామ్ సప్తాహ కార్యక్రమాలు ఆదివారం పూజా కార్యకర్తలు, కీర్తనలతో ముగిశాయి. సప్తాహ ముగింపు ఉత్సవాల సందర్భంగా విఠల్ రుక్మిణీ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పల్లకీ శోభాయాత్రను నిర్వహించారు. ఈ శోభాయాత్ర ఆలయం నుంచి ప్రారంభమైన పటేల్‌నగర్, హనుమాన్ నగర్ తదితర ప్రాంతాల్లో కొనసాగింది. ఈ పల్లకీ సేవ కార్యక్రమంలో గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పల్లకీ సేవలో ఆలయ కమిటీ ప్రతినిధులు, బీజేపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

'తెలంగాణలో ప్రజా వ్యతిరేక పాలన'

గోల్కొండ: తెలంగాణలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గుడిమల్కాపూర్‌లో బీజేపీ నాయకులతో కలిసి ఆయన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, బడుగు వర్గాల ప్రజలతో పాటు రైతాంగాన్ని కూడా సీఎం రేవంత్‌రెడ్డి మోసపూరిత ప్రకటనలతో పాలన కొనసాగిస్తున్నారన్నారు. సమగ్ర కుటుంబ సర్వే, ఇందిరమ్మ లబ్దిదారుల కోసం చేపట్టిన సర్వేలన్ని బూటకాలే అని ఆయన ఆరోపించారు. ఏదేమైనా రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొని ఉందని ఆయన అన్నారు.



మాట్లాడుతున్న దేవర శ్రీనివాస్

ఫుట్‌పాత్‌లపై ఈవీ చార్జింగ్ స్టేషన్లు



టోలిచౌకీ వద్ద..

గోల్కొండ: ఎలక్ట్రానిక్ వాహనాల సౌలభ్యం కోసం పలు ప్రాంతాల్లో చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు అయ్యాయి. మెహిదీపట్నం-టోలిచౌకీ మెయిన్ రోడ్డు, గోల్కొండ బంజారా దర్వాజ తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఈవీ చార్జింగ్ మిషిన్‌లు ఏర్పాటు కావడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టోలిచౌకీ సమీపంలో ఫుట్‌పాత్‌ను పూర్తిగా తొలగించి ఓ చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. దీనిపై పాదచారులు, మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా కమర్షియల్ విధానంలో ఏర్పాటు అవుతున్న ఈవీ చార్జింగ్ సెంటర్లు ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేయడం సమంజసమేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

అబిడ్స్: గోవా నుంచి రైలులో నగరానికి తెస్తున్న అక్రమ నాన్ డ్యూటీ పేయిడ్ మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో తనిఖీలు చేస్తుండగా గోవా నుంచి వాస్కోడిగామ రైలులో మద్యాన్ని అక్రమంగా తెస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ ఏఈఎస్ జీవన్ కిరణ్, ఎస్టీఎఫ్, డీటీఎఫ్ సీఐలు సుభాష్ చందర్, బాలరాజు, ఎస్ఐలు వెంకటేష్, రవితో కలిసి ఎక్సైజ్ సిబ్బంది 43 అక్రమ మద్యమ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ దాదాపు రూ.2 లక్షలు ఉంటుందని తెలిపారు. అక్రమ మద్యాన్ని పట్టుకున్న అధికారులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.



మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

నిరాశ్రయులకు ఫుట్‌పాతే ఆశ్రయం



మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్ రోడ్డు, రేతిబౌలి చౌరస్తా ప్రాంతాల్లో ఎంతో మంది అనాథలకు ఫుట్‌పాత్‌లే పడకలుగా మారాయి. పలుచోట్ల ఫుట్‌పాత్‌లపై, చెట్లు, మరికొన్ని చోట్ల శిథిలావస్థకు చేరిన పబ్లిక్ టాయిలెట్స్ ఉన్నాయి. వీటి నీడలోనే అనాథలైన వృద్ధులు నిద్రపోతున్నారు. పగలంతా భిక్షాటన చేస్తూ రాత్రి ఫుట్‌పాత్‌లే వీరికి ఆశ్రయం ఇస్తున్నాయి. పలువురు నాయకులు, సేవా సంస్థల వారు నిరుపేదలు, అనాథలకు దుప్పట్లు పంచుతున్నామని ప్రకటనలు ఇచ్చుకుంటున్నారు. మెహిదీపట్నం, సరోజిని ఆసుపత్రి, ఆసిఫ్‌నగర్ రోడ్డు, రేతిబౌలి తదితర ప్రాంతాల్లో ఉన్న వృద్ధులు, అనాథలు దుప్పట్లు అందజేయాలని కోరుతున్నారు. –గోల్కొండ

వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న గాజుల అంజయ్య, ఆత్రేయ ఆచార్యులు

చార్మినార్: చార్మినార్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈసారి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు శృంగారం రమణాచార్యులు ఆధ్వర్యంలో జనవరి 10 నుంచి 14వ తేదీ వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. ఇప్పటి నుంచే తగిన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ మేరకు ఆదివారం మీరాలంమండిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గాజుల అంజయ్య, శ్రీ బాలాజీ టెంపుల్ అర్చకులు అలంకార బ్రహ్మ ఆత్రేయ ఆచార్య తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు ఎక్కడ ఎలాంటి సౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.

బూత్ కమిటీ ఎన్నిక



బూత్ కమిటీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న అక్కినమోని వెంకటేష్ తదితరులు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ డివిజన్ పోలింగ్ బూత్ నంబర్ 186 బీజేపీకి సంబంధించిన ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు చర్మాణి రూప్‌రాజ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, ఉప్పుగూడ డివిజన్ మాజీ అధ్యక్షుడు అక్కినమోని వెంకటేష్, అధ్యక్షుడు సాయి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు కొనసాగాయి. బూత్ కమిటీ అధ్యక్షుడిగా ఎస్.కె.గోపాల్ శర్మ, కార్యదర్శి జి.పవన్, లాబర్థి ప్రముఖ్ జి.ప్రశాంత్, మన్ కీ బాత్ ప్రముఖ్ సి.శివకుమార్, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎస్.లక్ష్మీ కనకదుర్గ, బీఎల్ఏగా ఎం.మల్లయ్య, సభ్యులుగా సుభాష్, దుర్గా, భారతి, విజయ్ వాస్తవ్, లక్ష్మీకాంత్, సునీత, హరీష్ ఎన్నికయ్యారు. అనంతరం ప్రధాని మోదీ మన్ కీ బాత్ 117వ ఎపిసోడ్‌ను నూతనంగా ఎన్నుకోబడ్డ బూత్ అధ్యక్షుడు గోపాల్ శర్మ నివాసంలో నాయకులు వీక్షించారు.

ఐసీఏఆర్-సీఆర్ఐడీఏలో స్వచ్ఛతా ర్యాలీ



స్వచ్ఛతా ర్యాలీలో ఐసీఏఆర్-సీఆర్ఐడీఏ డైరెక్టర్ డాక్టర్ వి.కె.సింగ్, అధికారులు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని సెంట్రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ డ్రైలాండ్ అగ్రికల్చర్ (ఐసీఏఆర్-సీఆర్ఐడీఏ)లో స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. స్వచ్ఛతా పఖ్వాడాలో భాగంగా ఆదివారం స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీఏఆర్-సీఆర్ఐడీఏ డైరెక్టర్ డాక్టర్ వి.కె.సింగ్ క్రీడా క్యాంపస్ నుంచి ఐ.ఎస్.సదన్, సంతోష్‌నగర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వీటితో పాటు క్లీనెస్ డ్రైవ్, ప్లాంటేషన్ డ్రైవ్, వృథా నుంచి సంపదపై సాంకేతిక ప్రదర్శన, సంతకం ప్రచారాలు, శ్రమదాన్ కార్యకలాపాలు, సెల్ఫీ బూత్ ఇన్‌స్టాలేషన్, నుక్కడ్ నాటక ప్రదర్శన, స్వచ్ఛతా థీమ్‌పై క్విజ్, రంగోలీ పోటీల నిర్వహించనున్నారు. శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బంది, పరిపాలన సిబ్బంది, సహాయక సిబ్బందితో పాటు ఐసీఏఆర్-సీఆర్ఐడీఏ సిబ్బంది, ఐఏఆర్ఐ మెగా యూనివర్సిటీ హైదరాబాద్ హబ్ నుంచి విద్యార్థులు కూడా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు క్రియాశీలకంగా ఉండాలి



గోల్కొండ ఏసీపీతో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు

గోల్కొండ: పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు క్రియాశీలకంగా ఉండాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ఆదివారం పలువురు పీస్ కమిటీ సభ్యులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. నామ్‌కే వాస్తేగా కమిటీలో ఉన్న వారు ఇక నుంచి పని చేయకపోతే సభ్యత్వాన్ని రద్దు చేస్తామన్నారు. అదే విధంగా పోలీస్‌స్టేషన్‌లలో పరవీలు చేసే పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు కూడా తమ పద్ధతిని మార్చుకోవాలని సూచించారు. స్థానికంగా శాంతిభద్రతలను పరిరక్షించడం, వివిధ వర్గాల పండుగలను శాంతియుతంగా జరిగేలా పోలీసులకు సహకరించడం పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల పని అని ఆయన పేర్కొన్నారు. అయితే పలువురు పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు సమావేశాలకు హాజరుకావడం లేదని అటువంటి వారు స్వచ్ఛందంగా కమిటీల నుంచి వైదొలగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మిర్జా ఎక్బాల్ అహ్మద్, ఆబిద్, ఖైరుద్దీన్, ఆజామ్‌ఖాన్, ఇలియాస్ ఆలీ తదితరులున్నారు.

హిమ్మత్‌పురాలో ప్రత్యేక చాదర్ ఏర్పాటు

శాలిబండ: శాలిబండలోని హిమ్మత్‌పురా చౌరస్తాలో ప్రత్యేక చాదర్‌ను ఏర్పాటు చేశారు. ఈ చాదర్‌ను అజ్మీరాలో ఖాజా మోయినుద్దీన్ చిస్తీ ఉర్సు ఉత్సవాల కోసం పంపనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక చాదర్‌ను హిందువు, ముస్లింలు పెద్ద ఎత్తున దర్శించుకుంటున్నారు. ఈ చాదర్ జనవరి 3దీన హిమ్మత్‌పురా నుంచి బయలుదేరి జనవరి 6న అజ్మీర్ ఖాజా మోయినుద్దీన్ చిస్తీ చేరుకుంటుందని నిర్వాహకులు హజీ తెలిపారు.



శబరిమలకు తరలిన స్వాములు



ఇరుముడులు కడుతున్న రాహుల్‌దాస్ బాబా

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్ త్రివేణి సంగం రాంచంద్రజీ మఠం సన్నిదానం స్వాములు పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప పూజ నిర్వహించారు. అనంతరం స్వాములకు రాహుల్‌దాస్ బాబా ఇరుముడులు కట్టి పడి వెలిగించారు. అన్నదాన కార్యక్రమం అనంతరం స్వాములు శబరిమలకు బయల్దేరారు. గురుస్వాములు లింగారెడ్డి, గణేష్, భరత్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ



ఆసిఫ్‌నగర్ అయ్యప్ప మహా పడిపూజలో భక్తులు



సాయినగర్‌లో పూజల్లో పాల్గొన్న భక్తులు

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్‌లో నిర్వహించిన అయ్యప్పస్వామి మహా పడిపూజలో రమేష్ గురుస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో శంకర్‌నగర్, మురాద్‌నగర్, మల్లేపల్లి, కార్వాన్, గుడిమల్కాపూర్, జిర్రా తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అల్పాహార ప్రభుదుర్గమ్మ ఏర్పాటు చేసిన అల్పాహార ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు శివకుమార్, యాదగిరి, నర్సింగ్, సతీష్, అఖిల్, హరీష్, శైలజ పాల్గొన్నారు.

సాయినగర్‌లో..

సాయినగర్‌లో ఆదివారం మధ్యాహ్నం కుమార్ కన్నెస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పూజల్లో అయ్యప్ప దీక్షాధారులు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. అన్నదాన ప్రభువు కృష్ణవేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అల్పాహార ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కిరణ్, ఆనంద్, అరవింద్, అలేఖ్య పాల్గొన్నారు.